సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం । 13 । మార్చి । 2023



వివాహానికి వెళ్లొస్తూ మృత్యుఒడికి

రోడ్డు ప్రమాదంలో మర్రిపాడుకు చెందిన తండ్రి కుమారుడు మృతిచెందగా తల్లికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన కనిగిరి సమీపంలోని కాశిరెడ్డి కాలనీ వద్ద జరిగింది. 8లో..



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.58,430
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,219
3 శాతం జీఎస్టీతో	రూ.5,376
నవర (8 గ్రా)	రూ.43,008

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.2 /22.5

ఆదివారం గాలిలో 62 శాతం తేమ ఉంది. జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. సోమవారం వాతావరణంలో ఎలాంటి మార్పు ఉండదు.

న్యూస్‌రీల్

జిల్లా వ్యాప్తంగా పోలీసుల తనిఖీలు



ఆత్మకూరులో వాహన తనిఖీలు చేస్తున్న సెబ్ అధికారులు

నెల్లూరు(క్రైమ్): ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసింది. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఇప్పటికే రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, ఎన్నికల కేసుల్లో ఉన్న నిందితులను బైండోవర్ చేశారు. లైసెన్స్‌డ్ ఆయుధాలను సీజ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు ముమ్మరం చేశారు. మద్యం అక్రమ రవాణా, అక్రమ నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించారు. వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. శనివారం సాయంత్రం నుంచి ప్రచారపర్వం ముగియడంతో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. మద్యం దుకాణాలను మూసివేశారు. ఎక్కడా విక్రయాలు జరగకుండా పోలీసు, సెబ్ అధికారులు చర్యలు చేపట్టారు.

- **ఆత్మకూరు:** ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వాహనాలను తనిఖీ చేస్తున్నామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆత్మకూరు ఇన్‌స్పెక్టర్ బి.నయనతార తెలిపారు. ఆదివారం రాత్రి నెల్లూరు – ముంబై రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. మద్యం, నగదు, నగలు లాంటివి అనుమతి పత్రాలు లేకుండా సరఫరా చేస్తుంటే స్వాధీనం చేసుకుంటామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సెబ్ ఎస్సై కిరణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

మద్యం విక్రయాలు జరగకుండా..



తాటాకులదిన్నెలో మద్యం దుకాణం వద్ద సీలును పరిశీలిస్తున్న ఎస్‌ఈబీ అధికారులు

కొడవలూరు: ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కోవూరు ఎస్‌ఈబీ అధికారులు కొడవలూరు మండలంలో ఆదివారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. నార్తురాజుపాళెం, కొడవలూరు, తాటాకులదిన్నె, పద్మనాభసత్రంలో మద్యం దుకాణాల సీలును పరిశీలించడంతోపాటు పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఈబీ సీఐ ఆర్.నరహరి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా డ్రైడే అమల్లో ఉన్నందున మద్యం విక్రయాలు జరగకుండా అన్ని గ్రామాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. డ్రైడే పక్కాగా అమలు జరుగుతోందన్నారు. ఎస్‌ఈబీ సీఐ వెంట ఎస్సై సీ.శ్రీనివాస్, కానిస్టేబుళ్లు మస్తానయ్య, రాజు, తులసీ ఉన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



నగదు అందజేస్తున్న దాతలు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షి తాయి అమ్మవారి ఆలయంలో నిత్యాన్నదానానికి దాతలు ఆదివారం నగదు విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు మాట్లాడుతూ నెల్లూరుకు చెందిన వేటూరు చంద్రశేఖర్‌రెడ్డి – అపర్ణమ్మ దంపతులు వారి కుటుంబసభ్యులతో కలిసి అన్నదాన పథకానికి రూ.1,07,436ను విరాళంగా ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఈఓ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేయాలి

నెల్లూరు(అర్బన్): ఈనెల 16వ తేదీ నుంచి జిల్లాకు వర్షసూచన ఉందని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో పీపీసీల ద్వారా వెంటనే రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు చిరసాని కోటిరెడ్డి కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబును కోరారు. ఈ మేరకు ఆదివారం కలెక్టరేట్‌లో ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ ధర తగ్గించి కొనుగోలు చేసిన వారిపై చర్యలు చేపట్టాలన్నారు. రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు వీలులేనందున వేగవంతంగా కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాలని విజ్ఞప్తి చేశారు.

పోలింగ్ డే

- పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
- పటిష్ట బందోబస్తు నడుమ కేంద్రాలకు సామగ్రి
- పర్యవేక్షించిన కలెక్టర్, అధికారులు
- పట్టభద్రుల ఎమ్మెల్సీ పోటీలో 22 మంది
- టీచర్ ఎమ్మెల్సీ బరిలో 8 మంది



నెల్లూరులోని డీకేడబ్ల్యూ కాలేజీలో పోలింగ్ మెటీరియల్‌ను పరిశీలించుకుంటున్న సిబ్బంది

నెల్లూరు(అర్బన్): మండలి పోరుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు సంబంధించి పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు సోమవారం ఎన్నికలు జరుగుతాయి. ఇందుకు సంబంధించి ఎన్నికల మెటీరియల్‌ను జిల్లాలోని నాలుగు రెవెన్యూ డివిజన్ల నుంచి ఆదివారం ఆర్డీఓల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. విధుల్లో పాల్గొనే పీఓలు, ఏపీఓలు, సిబ్బంది బ్యాలెట్ బాక్స్‌లు, బ్యాలెట్ పత్రాలు, సీలు, ముద్రలు, ఓటేసేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక పెన్నులు తీసుకుని కేంద్రాలకు బయలుదేరారు. పోలింగ్ సమయం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు. 4 తర్వాత క్యూ లైన్‌లో ఉన్నవారిని ఎంత సమయమైనా ఓటేసేందుకు అనుమతిస్తారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో వీడియోగ్రఫీ తీస్తారు. ఓటింగ్ తీరును వెబ్‌కాస్టింగ్ ద్వారా కలెక్టర్ చక్రధర్‌బాబు, అధికారులు పరిశీలిస్తూ తగిన సూచనలిస్తారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీకి ఇలా..

పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో 22 మంది ఉన్నారు. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ నుంచి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, పీడీఎఫ్ నుంచి మీగడ వెంకటేశ్వరరెడ్డి, టీడీపీ నుంచి కంచర్ల శ్రీకాంత్‌చౌదరి పోటీ చేస్తున్నారు. జిల్లాలో 129 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిలో 79 కేంద్రాలను (25 ప్రాంతాల్లో) సమస్యాత్మకంగా గుర్తించారు. పోలింగ్ నిర్వహణకు 168 మందిని పీఓలు (పోలింగ్ ఆఫీసర్స్)గా, మరో 168 మందిని ఏపీఓలుగా, 316 మందిని ఓపీఓలుగా నియమించారు. 129 మంది ఇంజినీరింగ్ విద్యార్థులను వెబ్‌కాస్టింగ్ కోసం, మరో 129 మందిని సూక్ష్మ పరిశీలకులుగా, 26 మందిని వీడియోగ్రాఫర్లుగా నియమించారు. నాలుగు రూట్ల ద్వారా 24 బస్సులను ఏర్పాటు చేశారు. 284 పెద్ద బ్యాలెట్ బాక్స్‌లను ఎన్నికల కేంద్రాలకు తరలించారు. అభ్యర్థుల ఖర్చులకు సంబంధించి పరిశీలించేందుకు నాలుగు బృందాలను నియమించారు. ఎన్నికల్లో పాల్గొంటున్న 301 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును ముందుగానే ఉపయోగించుకున్నారు.

టీచర్ ఎమ్మెల్సీకి ఇలా..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో 8 మంది అభ్యర్థులున్నారు. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ నుంచి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పీడీఎఫ్ నుంచి పొక్కిరెడ్డి బాబురెడ్డి పోటీలో ఉన్నారు. 40 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 88 మీడియం సైజ్ బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేశారు. 16 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. 52 మంది పీఓలను, 52 మంది ఏపీఓలను, 98 మంది ఓపీఓలను నియమించారు. వెబ్‌కాస్టింగ్ నిర్వహణకు 40 మంది, మరో 40 మందిని సూక్ష్మపరిశీలకులుగా, 14 మందిని వీడియోగ్రాఫర్లుగా నియమించారు. ఖర్చులను పరిశీలించేందుకు నాలుగు బృందాలు ఏర్పాటయ్యాయి.

ఇవి తప్పనిసరి

ఓటర్లు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, పాస్‌పోర్టు, బ్యాంకు పాస్‌బుక్, డ్రైవింగ్ లైసెన్స్, జాబ్‌కార్డు ఇలా ఎన్నికల సంఘం గుర్తించిన 12 రకాల కార్డుల్లో ఏదో ఒకటి తీసుకెళ్లి ఓటు వేయాలి.

డీకేడబ్ల్యూ కాలేజీలో..

నెల్లూరు డివిజన్‌కు సంబంధించి ఆదివారం స్థానిక డీకేడబ్ల్యూ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి అధికారులు మెటీరియల్‌ను తీసుకుని బయలుదేరారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబు పరిశీలించారు. పోలింగ్ నిర్వహణలో తీసుకోవాల్సిన చర్యలను ఆయన అధికారులకు, సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటనారాయణమ్మ, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత, ఆర్డీఓ మలోల పాల్గొన్నారు.



నెల్లూరులో బ్యాలెట్ బాక్స్‌లను సిద్ధం చేస్తున్న సిబ్బంది

ఓటు వేయండి

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేశాం. పట్టభద్రులు, ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ఓటు వేయాలి. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశాం. సూక్ష్మ పరిశీలకులను నియమించాం. జిల్లాలో జరిగే ఎన్నికల సరళిని పరిశీలించేందుకు నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో వెబ్‌కాస్టింగ్ పరిశీలన కేంద్రాన్ని పెట్టాం. డివిజన్, జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశాం.

– చక్రధర్‌బాబు, కలెక్టర్



నెల్లూరులో సిబ్బంది వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబు



వరికుంటపాడు: పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది



కావలి : ఎన్నికల విధులకు విచ్చేసిన వివిధ మండలాల సిబ్బంది

ప్రశాంత వాతావరణంలో జరిగేలా..



మాట్లాడుతున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

ఆత్మకూరు: 'జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఏర్పాట్లు చేశాం. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి.' అని కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబు అన్నారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను కలెక్టర్ ఆదివారం పరిశీలించారు. పంపిణీ కార్యక్రమాన్ని గదుల్లో ఏర్పాటు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓపెన్ ప్లేస్‌లో పెట్టి ఎన్నికల సిబ్బందికి సూచనలిస్తూ సామగ్రిని అందించాలని ఆర్డీఓ సాధు కరుణకుమారికి సూచించారు. మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, ఆర్డీఓ కార్యాలయ ఏఓ మధుసూదన్‌లతో కలిసి వెంటనే ఆ ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం చక్రధర్‌బాబు విలేకరులతో మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. సమస్యాత్మక కేంద్రాల్లో రెట్టింపు పోలీస్ సిబ్బందిని నియమించామన్నారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి నమోదైన పోలింగ్ శాతాన్ని తెలియజేసే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులున్నారు.

పోలింగ్ సమయం

నేటి ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు..

జిల్లాలో ఓటర్లు

పట్టభద్రులు
పురుషులు : 68,423 మంది
స్త్రీలు : 39,205 మంది
ఇతరులు : ఏడుగురు

టీచర్లు

పురుషులు : 4,915 మంది
మహిళలు : 3,250

ఫిర్యాదులపై ఫోన్ చేయాల్సిన నంబర్ : 1950 (టోల్‌ఫ్రీ)

బందోబస్తు

విధుల్లో.. : 1,340 మంది
మొత్తం పోలింగ్ కేంద్రాలు : 169
సమస్యాత్మక కేంద్రాలు : 79
విధుల్లో ఉండే ఎన్నికల సిబ్బంది : 1,729 మంది

ప్రజా మద్దతుతో..

- ప్రతి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం
- ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ గెలుపుపై ధీమా
- ఆ పార్టీ అభ్యర్థులకు అండగా అన్నివర్గాలు
- బెడిసికొట్టిన టీడీపీ, పీడీఎఫ్ 'సహకారం'

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: 2019 సాధారణ ఎన్నికల తర్వాత వైఎస్సార్‌సీపీ ఫుల్ జోష్‌తో ముందుకెళ్తోంది. ప్రతి ఎన్నికల్లోనూ ప్రత్యర్థులపై ఘన విజయం సాధించింది. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే శ్రీరామరక్ష అని, సోమవారం జరిగే పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎలక్షన్లలోనూ విజయం తమనే వరిస్తుందని ఆ పార్టీ నాయకులు ధీమాగా చెబుతున్నారు.

వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మూడునెలలుగా ప్రచారంలో వ్యూహాత్మకంగా అడుగులు వేశారు. మరోవైపు పార్టీ అధిష్టానం ఎంపీలు, పార్టీ బాధ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అనుబంధ సంఘాల అధ్యక్షులను రంగంలోకి దింపింది. ప్రతి ఓటర్‌ను కలిసేలా ముమ్మరంగా ప్రచారం చేశారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధిని వివరించారు. విద్యాభివృద్ధికి తీసుకున్న చర్యలు, యువతకు ప్రభుత్వం చేసిన మేలును చెప్పారు. గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఉత్సాహంతో పనిచేశాయి. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు అందరూ మమేకమై ప్రచారం నిర్వహించి ఓటర్లను చైతన్య పరిచారు. దీంతో వారంతా వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థుల వైపు మొగ్గు చూపుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పాపం టీడీపీ

ప్రతి ఎన్నికలోనూ టీడీపీ ప్రభావం చూపలేకపోయింది. మారిన సమీకరణాల నేపథ్యంలో పట్టభద్రులు, ఉపాధ్యాయులు వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారన్న సంకేతాలతో భయపడింది. దీంతో ఆ పార్టీ, పీడీఎఫ్‌లు రెండో ప్రాధాన్యతా ఓటు విషయంలో ఒకరికొకరు సహకరించేందుకు ఒప్పందం చేసుకున్నాయి. దీనిపై టీడీపీ వర్గాలు భగ్గుమంటున్నాయి. ఎన్నిక ఏదైనా వైఎస్సార్‌సీపీ ఒంటరిగా పోటీ చేసి విజయాల పరంపర కొనసాగిస్తుంటే, 40 ఏళ్ల ఇండస్ట్రీ అంటూ గొప్పలు చెప్పే చంద్రబాబు వేరే పార్టీల స్నేహం కోసం తహతహలాడడం దారుణమంటున్నారు. విజయం సాధించలమేని నమ్మకం లేనప్పుడు పోటీ ఎందుకు పెట్టాల్సి వచ్చిందని ప్రశ్నిస్తున్నారు.

సోమశిలలో 57.876 టీఎంసీలు



సోమశిల: సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 57.876 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు 2,100 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 473, దక్షిణకాలువకు 400, కండలేరుకు 100 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 97.697 మీటర్ల నీటి మట్టం ఉంది. సగటున 353 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వృథా అవుతోంది.

కండలేరులో..

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 43.086 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగ కాలువకు 910 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 50, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయిజ్‌కు 50, హైలెవల్ స్లూయిజ్‌కు 140 క్యూసెక్కుల వంతున నీరు విడుదల చేస్తున్నట్లు తెలియజేశారు.

జిల్లాలో తిరుగులేని శక్తిగా వైఎస్సార్‌సీపీ

- మరింత శక్తివంతంగా తయారు చేద్దాం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న మంత్రి కాకాణి, చిత్రంలో శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

నెల్లూరు(సెంట్రల్): 'వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లాలో తిరుగులేని శక్తిగా ఉంది. ఇంతటితో ఆగకుండా పార్టీని మరింత శక్తివంతంగా తయారు చేద్దాం.' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సూచనల మేరకు ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి కాకాణి మాట్లాడుతూ గతంలో ఎంతోమంది రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసి అధికారంలోకి రాక ముందే మూసేసిన చరిత్ర ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ ద్వారా ఎంతోమందిని ఎమ్మెల్యేలు, మంత్రులు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. అన్ని ఎన్నికల్లో పార్టీ గెలుపొంది తిరుగులేని శక్తిగా అవతరించిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఎదుర్కోలేక అనేక పార్టీలు ఒకరికొకరు సహకరించుకునేలా ఒప్పందాలు చేసుకున్నాయని విమర్శించారు. దీనిని బట్టి చూస్తే వైఎస్సార్‌సీపీ ఎంత బలంగా ఉందో తెలుస్తోందన్నారు. క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తల అండతో ముందుకు సాగుతామన్నారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాకు సంబంధించి పదికి పది అసెంబ్లీ స్థానాల్లో మరోసారి విజయం సాధించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇస్తామన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో జెండా ఎగురవేసి, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఆ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, నాయకులు మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, నెల్లూరు శివప్రసాద్, మందల వెంకటశేషయ్య, మాలెం సుధీర్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా ఉండొద్దు..

అప్రమత్తంగా ఉండండి



బందోబస్తు విధులకు హాజరైన పోలీసు అధికారులు, సిబ్బంది



మాట్లాడుతున్న ఎస్పీ విజయారావు

- ఎస్పీ సీహెచ్ విజయారావు

నెల్లూరు(క్రైమ్): 'ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండొద్దు. అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలి. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం.' అని ఎస్పీ సీహెచ్ విజయారావు హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో శాసనమండలి ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. బందోబస్తు విధుల్లో పాల్గొంటున్న సిబ్బందికి ఆయన నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో ఆదివారం దిశానిర్దేశం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. ప్రిసైడింగ్ అధికారి అనుమతి లేకుండా పోలింగ్ కేంద్రాల్లోకి వెళ్లరాదన్నారు. తాగునీటి బాటిల్స్, ఇంకు సీసాలు, మొబైల్‌ఫోన్లు, పెన్నులు తదితరాలను లోనికి అనుమతించరాదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఓటర్లతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఏదైనా సమస్యలు తలెత్తితే వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు.

పటిష్ట పోలీసు భద్రత

ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పటిష్ట పోలీసు భద్రత ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. బందోబస్తు విధుల్లో 1,340 మంది సిబ్బంది, నాలుగు సెక్షన్ల ఏపీఎస్పీ బలగాలు పాల్గొంటున్నాయని తెలిపారు. 21 రూట్లలో 21 మొబైల్ పార్టీలు, 24 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 39 ఎంసీసీ టీమ్స్, 49 స్ట్రైకింగ్ ఫోర్సు, 33 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులను ఏర్పాటు చేశామన్నారు. కేంద్రాలవద్ద 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని, వంద మీటర్ల దూరం వరకు ఎవరూ గుంపులుగా ఉండకూడదని స్పష్టం చేశారు. ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్, శ్రీనివాసరావు, నెల్లూరు నగర, రూరల్ డీఎస్పీలు, డి.శ్రీనివాసరెడ్డి, పి.వీరాంజనేయరెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు మధుబాబు, షఫీ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిని అటకాయించి నగదు దోపిడీ

- నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): యువకుడిని అటకాయించి నగదు దోచుకెళ్లిన ఘటనలో నిందితులను ఆదివారం నెల్లూరు చిన్నబజారు పోలీసులు అరెస్ట్ చేశారు. వారి కథనం మేరకు.. మనుమసిద్ధినగర్‌కు చెందిన కె.వెంకటశరత్ గూడూరులోని ఓ కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. అతను రోజూ కళాశాలకు బస్సులో వెళ్లి వస్తుంటాడు. శనివారం రాత్రి ఎప్పటిలాగే బస్సులో నెల్లూరులో దిగాడు. ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా సీఏఎం స్కూల్ వద్ద ఇద్దరు వ్యక్తులు అతడిని అటకాయించారు. ఇంకో ఇద్దరు మోటార్‌బైక్‌పై వచ్చారు. అందరూ కలిసి కత్తులు, రాడ్లతో చంపుతామని బెదిరించి జేబులో ఉన్న రూ.1,000 దోచుకెళ్లారు. ఈ మేరకు బాధితుడు శనివారం అర్ధరాత్రి చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై ఎ.సైదులు కేసు నమోదు చేశారు. ఘటనా స్థలంలోని సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా నలుగురు నిందితులను గుర్తించారు. అందులో ముగ్గురు మైనర్లు కావడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు మనుమసిద్ధినగర్‌కు చెందిన అరవింద్‌ను అరెస్ట్ చేశారు. వారిని కోర్టులో హాజరుపరిచారు.

క్లుప్తంగా

పక్కాగా ముత్యాలమ్మ జాతర ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఆలయ ఈఓ నవీన్‌కుమార్

చిల్లకూరు: తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో జరిగే జాతరకు పక్కా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు. తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముత్యాలమ్మ ఆలయంలో ప్రతి ఏడాది ఉగాదికి ముందు వచ్చే మంగళవారం నుంచి శుక్రవారం వరకు జాతరను నిర్వహిస్తారన్నారు. గత రెండేళ్లుగా కోవిడ్ కారణంగా జాతరను భక్తులతో నిర్వహించలేకపోయామని, ఈ ఏడాది భక్తులు పాల్గొనేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గూడూరు ఆర్డీఓ కిరణ్ కుమార్ ఆదేశాలతో ఏర్పాట్లు పక్కాగా చేస్తున్నామని తెలిపారు. జాతర మూడు రోజుల పాటు జరుగుతుందని, లక్షల మంది భక్తులు రావచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆలయ అర్చకులు శివప్రసాద్ స్వామి, రమణయ్య పాల్గొన్నారు.

'స్మోకింగ్ కిల్స్'పై సైకత శిల్పం



సైకత శిల్పాన్ని రూపొందిస్తున్న సనత్‌కుమార్

చిల్లకూరు: తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం ఏరూరు గ్రామానికి చెందిన సైకత శిల్పి మంచాల సనత్‌కుమార్ 'ధూమ పానంతో ఆరోగ్యం క్షీణిస్తుంది' అనే అంశంపై సముద్ర తీరంలో ఆదివారం సైకత శిల్పాన్ని రూపొందించారు. ఈ శిల్పానికి 'స్మోకింగ్ కిల్స్' అనే ట్యాగ్ లైన్ ఏర్పాటు చేశారు. 'ప్రపంచ నో స్మోకింగ్ డే' సందర్భంగా రూపొందించిన ఈ సైకత శిల్పం ఆకట్టుకుంటోంది.

షార్ట్ సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం

- రూ.10 లక్షలకు పైగా నష్టం



దుకాణంలో కాలిబూడిదైన సామగ్రి


చేజర్ల: మండలంలోని తూర్పుకంభంపాడు(టీకేపాడు)లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఓ దుకాణం దగ్ధమైన ఘటన ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. బాధితుడి కథనం మేరకు గ్రామానికి చెందిన మెంటా సురేష్ రామాలయం వీధిలో ఉంటూ స్థానికంగా చిల్లర దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి 9 గంటలకు ఆవలమిట్టలో ఉండే దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లి నిద్రించాడు. తెల్లవారుజామున దుకాణం నుంచి భారీగా మంటలు రావడంతో పక్కనే నివాసం ఉంటున్న తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారు సురేష్‌కు సమాచారమిచ్చారు. సురేష్ దుకాణం వద్దకు వచ్చి చూడగా దుకాణమంతా మంటలు వ్యాపించి ఉండడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ దుకాణంలోని సరుకులన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. రూ.10 లక్షలకు పైగా విలువ చేసే దుకాణంలోని సరుకులన్నీ దగ్ధమయ్యాయని బాధితుడు వాపోయాడు. ఈ ఘటనపై బాధితుడు చేజర్ల పోలీసులకు సమాచారం ఇచ్చాడు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కావలి: పట్టణంలోని మద్దూరుపాడు వద్ద పెద్దినేటి రామయ్య అనే వ్యక్తి వద్ద అక్రమంగా 487 మద్యం బాటిల్స్ ఉండడంతో ఆదివారం కావలి రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

నులిపురుగులను నులిమేద్దాం

నులిపురుగుల వల్ల చిన్నారుల్లో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. వీటి వల్ల రక్తహీనత, తరచూ జ్వరం, కడుపునొప్పి రావడం తదితర సమస్యలతో బాధపడుతుంటారు. వీటిని నివారించడం ద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని భావించిన ప్రభుత్వం, పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేసేలా చర్యలు తీసుకుంటోంది.



- ఈ నెల 14న నులిపురుగుల నివారణ దినోత్సవం
- విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు వేసేలా ప్రభుత్వం చర్యలు
- పంపిణీకి రంగం సిద్ధం చేసిన అధికారులు

జిల్లాలో..

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు	3,451
కళాశాలలు	255
అంగన్‌వాడీ కేంద్రాలు	2,934
విద్యార్థుల సంఖ్య	6,33,972 మంది

కావలి/బిట్రగుంట: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. పిల్లల ఆరోగ్యాన్ని దెబ్బతీసే నులిపురుగులను నివారించడంపై దృష్టి సారించింది. సాధారణంగా చిన్నారులు మట్టిలో ఆడుకోవడం, పరిశుభ్రత గురించి తెలియకపోవడంతో పిల్లల్లో నులిపురుగుల సమస్య ఎక్కువగా ఉంటుంది. నులిపురుగుల కారణంగా ఎంత ఆహారం తిన్నా శక్తి రాకపోవడం, పోషకాహారలోపం, రక్తహీనత, తరచూ జ్వరం, కడుపునొప్పి రావడం వంటి సమస్యలు కన్పిస్తుంటాయి. వీటికి మూలకారణమైన నులిపురుగులపై తల్లిదండ్రులకు పెద్దగా అవగాహన లేకపోవడంతో చిన్నారుల ఆరోగ్యంపై నులిపురుగులు తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ఈ క్రమంలో చిన్నారులు, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం నులిపురుగుల నివారణకు పక్కాగా ప్రణాళిక రూపొందించింది. ఒక సంవత్సరం నుంచి 19 ఏళ్ల లోపు వయస్సు గల ప్రతి ఒక్కరికీ నులిపురుగుల నివారణ మాత్రలు(డీవార్మింగ్ టాబ్లెట్స్) పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ నెల 14న నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో డీవార్మింగ్ మాత్రలు పంపిణీ చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టింది.

వైద్యారోగ్యశాఖ ద్వారా..

జిల్లాలో ఉన్న 3,451 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, 2,934 అంగన్‌వాడీ కేంద్రాలు, 255 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, నర్సింగ్, డిగ్రీ కళాశాలల్లో(మొదటి సంవత్సరం విద్యార్థులకు మాత్రమే)ని విద్యార్థులకు ఈ నెల 14వ తేదీన ప్రభుత్వం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయనుంది. జిల్లావ్యాప్తంగా వైద్యారోగ్యశాఖ ద్వారా 6,33,972 మాత్రలు పంపిణీ చేయనుంది. అలాగే అదేరోజు అన్ని పాఠశాలల్లో పరిశుభ్రతపై విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మాత్రల పంపిణీ ఇలా..

వైద్యారోగ్యశాఖ సిబ్బంది, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఒకటి నుంచి రెండేళ్ల లోపు చిన్నారులకు 200 మిల్లీగ్రాముల ఆల్‌బెండజోల్ మాత్రను నీటిలో కలిపి ఇస్తారు. రెండేళ్ల నుంచి 19 సంవత్సరాల లోపు వారికి 400 మిల్లీగ్రాముల మాత్రను ఇస్తారు. అదేవిధంగా భోజనానికి గంట ముందు ఉపాధ్యాయులు, వైద్యారోగ్యశాఖ సిబ్బంది నులిపురుగుల వ్యాప్తి, లక్షణాలు, నివారణ, చేతులు శుభ్రం చేసుకోవడం, ఆరోగ్యకరమైన అలవాట్లపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు.

ఎదిగే పిల్లల ఆరోగ్యానికి రక్షణ

నులిపురుగుల నివారణ మాత్రలు(ఆల్‌బెండజోల్) పిల్లల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా రక్షణ కల్పిస్తాయి. ఈ మాత్రలను పిల్లలు మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత నమిలి మింగాలి. అలాగే చేతుల శుభ్రతపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించాలని వైద్యారోగ్యశాఖ సిబ్బందికి తెలియజేశాం.



– డాక్టర్ బ్రిజిత, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ, కావలి

కనుపూరు జాతరకు 35 ప్రత్యేక బస్సులు

కోట: తూర్పుకనుపూరులో జరిగే ముత్యాలమ్మ జాతరకు వాకాడు ఆర్టీసీ డిపో నుంచి 35 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ మధుశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కోట ఆర్టీసీ ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ నుంచి కనుపూరు ముత్యాలమ్మ జాతర జరగనున్న క్రమంలో మూడు రోజులపాటు నాయుడుపేట నుంచి కోట మీదుగా కనుమూరుకు ప్రత్యేక బస్సులు నడుపుతామని తెలిపారు. కోట ఆర్టీసీ ప్రాంగణంలో భక్తుల కోసం మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ సూపర్‌వైజర్ కృష్ణమ్మ పాల్గొన్నారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి : రూ.92
సన్నవి : రూ.85
పండ్లు : రూ.45



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 106
లేయర్ (లైవ్) : 75
బ్రాయిలర్ చికెన్ : 190
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 210
లేయర్ చికెన్ : 128



యాదవ యువతకు అండగా ఉంటాం



భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు

నెల్లూరు(వేదాయపాళెం): జిల్లాలో యాదవ యువత ఉన్నత విద్యావంతులుగా, ఆర్థికంగా, పారిశ్రామికంగా ఎదిగేందుకు తాము అండగా ఉంటామని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ తెలిపారు. ఆదివారం స్థానిక కొండాయపాళెం – గొలగమూడి రోడ్డులో యాదవ్ భవన్ భూమిపూజ ఘనంగా జరిగింది. అనంతరం బొమ్మి నాగకిశోర్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ రూ.10 కోట్ల వ్యయంతో యాదవ్ భవన్ నిర్మించడం సంతోషకరమన్నారు. విద్యార్థులకు వసతి కల్పించడంతో పాటు యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ నిర్వహించనున్నారని, కల్యాణ మండపం, మినీ ఫంక్షన్ హాలు నిర్మిస్తున్నారని తెలిపారు. యాదవుల అభివృద్ధికి పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి కృష్ణయ్య, బీద గిరియాదవ్, ఏపీ డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, చిన్న మస్తానయ్య, భరత్‌కుమార్, ఆనందయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌పేట మాజీ సర్పంచ్ అరెస్ట్

అనుమసముద్రంపేట: లైంగిక వేధింపుల కేసులో ఏఎస్‌పేట దర్గా పీఠాధిపతి హఫీజ్‌పాషాను అరెస్ట్ చేసిన తెలంగాణ పోలీసులు, ఆయన సమీప బంధువైన ఏఎస్‌పేట మాజీ సర్పంచ్ సంధానీబాషాను కూడా ఆదివారం ఏఎస్‌పేటలో అరెస్ట్ చేశారు. ఆదివారం తెల్లవారుజామున దర్గామహల్ వద్దకు వచ్చిన తెలంగాణ పోలీసులు పలువురిని విచారించారు. సంధానీబాషాను స్థానిక ఏఎస్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. ఓ మహిళ హఫీజ్‌పాషాపై ఇచ్చిన ఫిర్యాదుతో లైంగిక ఆరోపణలు చేస్తున్న హఫీజ్‌పాషాను అరెస్ట్ చేసి చంచల్‌గూడ జైలులో ఉంచిన విషయం తెలిసిందే. అయితే ఆయనకు అండగా ఉంటూ ఫిర్యాదు చేసిన మహిళను కేసు వాపసు తీసుకోవాలంటూ అనేక రకాలుగా బెదిరించినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో స్పందించిన హైదరాబాద్ పోలీసులు ఆయనను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

వివాహానికి వెళ్లొస్తూ మృత్యుఒడికి



నర్రా బ్రహ్మేశ్వరరావు మృతదేహం



నర్రా రామకోటేశ్వరరావు మృతదేహం



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

- రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారుడు దుర్మరణం
- మరొకరి పరిస్థితి విషమం
- కనిగిరి సమీపంలో చప్టా గుంతలో పడిన కారు
- మృతులది మర్రిపాడు మండలం రాంపల్లి గ్రామం

కనిగిరి రూరల్: రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారుడు మృతిచెందగా తల్లికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ప్రకాశం జిల్లా కనిగిరి సమీపంలోని కాశిరెడ్డి కాలనీ వద్ద ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మర్రిపాడు మండలం రాంపల్లి గ్రామానికి చెందిన నర్రా రామకోటేశ్వరరావు, అతని కుమారుడు నర్రా బ్రహ్మేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందారు. రామకోటేశ్వరరావు భార్య సత్యవాణి తలకు బలమైన గాయాలు కావడంతో ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు.

వివాహానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో..

పోలీసుల కథనం మేరకు.. కృష్ణాజిల్లా పెసలపాడు గ్రామానికి చెందిన నర్రా రామకోటేశ్వరరావు కుటుంబం 23 ఏళ్ల క్రితం మర్రిపాడు మండలం రాంపల్లి గ్రామానికి వలస వచ్చి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో బాపట్ల జిల్లా రేపల్లె సమీపంలో రాయవారిపల్లిలో వివాహానికి హాజరయ్యేందుకు నర్రా బ్రహ్మేశ్వరరావు, తండ్రి రామకోటేశ్వరరావు, తల్లి సత్యవాణి కలిసి కారులో వెళ్లారు. పెళ్లి అనంతరం శనివారం రాత్రి కారులో తిరుగు ప్రయాణమయ్యారు. వీరు ప్రయాణిస్తున్న కారు 2:30 గంటల సమయంలో కనిగిరి సమీపంలోని కాశిరెడ్డి కాలనీ వద్దకు రాగానే చప్టా గుంతలో పడి పల్టీలు కొట్టింది. ప్రమాదంలో కారు నడుపుతున్న నర్రా బ్రహ్మేశ్వరరావు(48), నర్రా రామకోటేశ్వరరావు(67) అక్కడికక్కడే మృతిచెందారు. వెనుక సీటులో కూర్చున్న సత్యవాణికి తీవ్రగాయాలయ్యాయి. ఆమెను 108 వాహనంలో కనిగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమచికిత్స అనంతరం ఒంగోలులోని రిమ్స్‌కు తరలించారు. కారులో ఇరుక్కుపోయిన నర్రా బ్రహ్మేశ్వరరావు మృతదేహాన్ని పోలీసులు బయటకు తీశారు. తండ్రి కుమారుల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. కాగా రామకోటేశ్వరరావు పుట్టు అంధుడని బంధువులు తెలిపారు. నర్రా బ్రహ్మేశ్వరరావుకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనా స్థలాన్ని సీఐ బి.పాపారావు, ఎస్సై దాసరి ప్రసాద్‌లు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగి ఉంటే ప్రాణాలు దక్కేవి


మార్గమధ్యంలో పొదిలిలో ఆగి ఉదయాన్నే వెళ్లాలని బంధువులు చెప్పినా వినకుండా ప్రయాణం సాగించినట్లు తెలిపారు. అక్కడ ఆగి ఉన్నా ప్రాణాలు దక్కేవేమోనని బంధువులు బోరున విలపించారు. సుమారు అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో బ్రహ్మేశ్వరరావు భార్య జ్యోతికి ఫోన్ చేసి దర్శి సమీపంలో ఉన్నానని చెప్పాడని, ఆ తర్వాత ఫోన్ పని చేయలేదని కన్నీరుమున్నీరుగా విలపించారు.

రాంపల్లిలో విషాదఛాయలు

మర్రిపాడు: మండలంలోని రాంపల్లి గ్రామానికి చెందిన నర్రా రామకోటేశ్వరరావు, అతని కుమారుడు బ్రహ్మేశ్వరరావు ఆదివారం తెల్లవారుజామున జరిగిన ప్రకాశం జిల్లా కనిగిరి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అందరితో కలివిడిగా ఉండే రామకోటేశ్వరరావు మృతి బాధాకరమని గ్రామస్తులు పేర్కొన్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

సూళ్లూరుపేట: తమిళనాడుకు గంజాయి తరలిస్తున్న అంతర్రాష్ట్ర స్మగ్లింగ్ ముఠాను తిరుపతి జిల్లా సూళ్లూరుపేట పోలీసులు అరెస్ట్ చేశారు. డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి ఆదివారం సూళ్లూరుపేటలో మీడియాతో మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన కొంతమంది బెడ్‌షీట్లు అమ్ముకునే వారి లాగా రైళ్లలో గంజాయి తీసుకొచ్చి సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌కు చేర్చగా.. తమిళనాడుకు చెందిన మరికొంతమంది బెడ్‌షీట్లు కొనుగోలు చేసినట్లుగా నటించి ఆ గంజాయిని తీసుకుని వెళుతున్నారని తెలిపారు. ఈ తరహాలో సూళ్లూరుపేట పట్టణాన్ని కేంద్రంగా చేసుకుని గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ముఠాను రైల్వేస్టేషన్ రోడ్డులో అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి నుంచి రూ.3.84 లక్షల విలువ చేసే 12 కిలోల గంజాయి, 8 మొబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ముఠాలో అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన ఐదుగురు, తమిళనాడుకు చెందిన ఇద్దరు ఉన్నట్లు తెలిపారు. వీరిలో ముగ్గురు మహిళలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆదివారం పట్టుబడిన ముఠాలో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం లోతుగడ్డ ప్రాంతానికి చెందిన చెందిన మొహమ్మద్ బరీద్, గూడెం కొత్తపల్లి మండలం, దేవరపల్లికు చెందిన సబ్రాబార్ సాదిక్ 12 కిలోల గంజాయిని తీసుకొచ్చి రైల్వే స్టేషన్ రోడ్డులోని పోస్టాఫీస్ వద్ద ఎదురు చూస్తుండగా, తమిళనాడులోని చెంగల్పట్‌కు చెందిన మారియప్పన్, చెన్నైకు చెందిన కన్మణి, ఏ రమణి, మణిమేఘలై, శివకుమార్ వచ్చి వారితో బేరం కుదుర్చుకునే సమయంలో పోలీసులు దాడులు చేసి, అందరినీ అక్కడికక్కడే అరెస్ట్ చేశారని తెలిపారు. వీరిని కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు తెలిపారు. సీఐ వెంకటేశ్వర్లురెడ్డి, ఎస్సైలు రవిబాబు, జీసీ శ్రీనివాసులురెడ్డి, ఎం.జ్ఞానశేఖర్, మనోజ్‌కుమార్, సిబ్బంది శీనయ్య, ఎస్.కిషన్, ఎన్.గిరిబాబు, జె.రజని, అంకమ్మ వారం రోజుల్లో 24 కిలోల గంజాయిని పట్టుకున్నారని తెలిపారు.



స్మగ్లింగ్ ముఠా వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి